క్లుప్తంగా

రోడ్డు నిర్మించాలని ధర్నా



ధర్నా చేస్తున్న తండావాసులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని అల్లాపూర్ పంచాయతీ పరిధి మల్వరేగడి తండావాసులు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాశ్‌రాథోడ్ ఆధ్వర్యంలో తండా రోడ్డుపై గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాథోడ్ మాట్లాడుతూ తండాలో ఎవరైనా అనారోగ్యం, ప్రమాదానికి గురైతే అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదని, వర్షాలు కురిస్తే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్పందించి తండాకు రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు శ్రీనివాస‌నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న రోషన్‌రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సమీకృత వసతి గృహంలోని 335 మంది విద్యార్థులకు గురువారం ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్ రెడ్డి బెడ్‌షీట్లు, కార్పెట్లు, నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, రైబస అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, కర్ర రమేష్‌చౌహాన్, వార్డెన్ రవి పాల్గొన్నారు.

న్యాయవాది విష్ణువర్ధన్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని దుదగొండకు చెందిన పట్లోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి సంగారెడ్డిలోని జిల్లా కోర్టు న్యాయవాదిగా పనిచేస్తూ గురువారం హఠాన్మరణం చెందారు. నారాయణ ఖేడ్ కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ స్వరూప్ షెట్కార్, ప్రధాన కార్యదర్శి మారుతిరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది లక్ష్మణ్‌రావు, సీనియర్ న్యాయవాదులు భోజిరెడ్డి, నర్సారెడ్డి, నర్సింహ్మారావు, సంగమేశ్వర్ రెడ్డి, సాయిలు, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు



వంతెనను పరిశీలిస్తున్న గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. అమీన్‌పూర్, రామచంద్రపురం కలిపే వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా స్థానికులతో కలిసి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరిఅంజిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ బ్రిడ్జిపై వెళ్తున్న కారు వరదనీటిలో కొట్టుకుపోవడం.. అందులో ఉన్న ఓవ్యక్తి మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వంతెన నిర్మిస్తామని హామీనిచ్చి విస్మరించారని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి వెంటనే వంతెన నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్, అమీన్‌పూర్ పార్టీ మండల అధ్యక్షుడు ఆగారెడ్డి, రామచంద్రపురం ప్రధాన కార్యదర్శి బలరాం, సాయినగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్ చౌహాన్

నారాయణఖేడ్: స్థానిక సంస్థలకు సంబంధించి జిల్లా నూతన అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌ను గురువారం నారాయణఖేడ్‌కు చెందిన బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రమేష్‌చౌహాన్ సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సంఘం నాయకులు లక్ష్మణ్‌నాయక్, మోహన్‌నాయక్, చంద్రమోహన్ ఉన్నారు.

వీడని వర్షం.. తప్పని తిప్పలు

- బురదమయంగా కాలనీలు, రహదారులు
- పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
- ఎడతెరిపిలేని వర్షంతో ఇబ్బందులు



సదాశివపేట పట్టణం: చిత్తడిగా సిద్దాపూర్ రోడ్డు

సదాశివపేట(సంగారెడ్డి): ఎడతెరిపిలేకుండా వర్షాలతో పట్టణ పరిధిలోని రహదారులు బురదమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పట్టణ పరధిలోని సిద్దాపూర్ రోడ్డు బురదతో చిత్తడిగా మారింది.

నారాయణఖేడ్: కుండపోతగా కురుస్తున్న వర్షంతో నిజాంపేట్ మండలంలో 47.8మిల్లీమీటర్లు, కల్హేర్‌లో 42.2, నారాయణఖేడ్‌లో 38.6, మనూరులో 36.4, నాగల్‌గిద్ద, సిర్గాపూర్‌లలో 34, కంగ్టిలో 31.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఒక్కో మండలంలో సరాసరి 15మిల్లీమీటర్ల వర్షం కురవడంతో పలు కాలనీలు చిత్తడిగా మారాయి.

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కేరూర్ గ్రామంలో ఊర చెరువు అలుగు పారుతోంది. భూత్కూర్ గ్రామ రోడ్డు వర్షానికి చిత్తడిగా మారడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

హత్నూర(సంగారెడ్డి): రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండల కేంద్రానికి చెందిన కొండెగళ్ల గల్లా పెద్ద బాగయ్యకు చెందిన పెంకుటిల్లు గురువారం వర్షంతో ఇంటి పైకప్పు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



సంగారెడ్డిలో రహదారిపై నిలిచిన వర్షంనీరు



వర్షంతో కూలిన ఇంటి పైకప్పు

సంగారెడ్డి టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులలో నీటితో నిండిపోయాయి. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద నుంచి నీరు రోడ్లపై నిలవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు కాలనీలు వర్షంనీటితో నిండిపోయాయి.

జహీరాబాద్ టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు చేరింది. జహీరాబాద్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన వసంత్‌విహార్, ఆదర్శనగర్ కాలనీ మహీంద్ర, ఆనంద్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



చెరువును తలపిస్తున్న వసంత్ విహార్ కాలనీ



రామచంద్రాపురంలో..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో భారీగా వరదనీరు చేరడంతో గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. అదేవిధంగా పాటి చౌరస్తా సమీపంలో వరదనీటితో నిండిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వరదనీటిని తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా స్థానిక పోలీసులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ పరమేశం, సీఐ లాలునాయక్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, విద్యుత్‌శాఖ ఏడీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన మైనార్టీ యువకులు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఎండీ ఫయాజ్, అధ్యక్షుడు సయ్యద్ మైహియొద్దీన్, నాయకులు ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు నూతనంగా బస్ సర్వీసులు

జహీరాబాద్ టౌన్: ప్రజలకు ఆర్టీసీ సేవలు మరింత చేరువయ్యేందుకు ఆయా గ్రామాలకు కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించామని డిపో మేనేజర్ రజనీకృష్ణ తెలిపారు. విద్యార్థుల డిమాండ్ మేరకు రాయికోడ్ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రాయికోడ్ నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరి కుసుకూర్, మాటూర్, ఖంజమల్‌పూర్, ఇటికెపల్లి, నాగ్వార్‌ల మీదుగా తిరిగి 9.15 గంటలకు రాయికోడ్‌కు చేరుకుంటుందన్నారు. సాయంత్రం 7.30 గంటలకు తిరిగి రాయికోడ్ నుంచి ఆయా గ్రామాలకు బస్సు వెళ్తుందన్నారు. కోహీర్ ఎక్స్ రోడ్డు నుంచి జీర్లపల్లి గ్రామం మీదుగా బోరెగావ్, బొప్పన్‌పల్లి, మండల కేంద్రమైన ఝరాసంగంకు మరో బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదు మేరకు వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి వరకు కొత్త బస్సు సర్వీస్ ప్రారంభించామన్నారు. మధ్యాహ్నం 3.15 గంటలకు జహీరాబాద్ డిపో నుంచి బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు మర్పల్లికి చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి తిరిగి జహీరాబాద్‌కు ప్రయాణమవుతుందన్నారు. ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం రజనీకృష్ణ సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీపీ కార్మికులు వినూత్న నిరసన



సదాశివపేట: ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సదాశివపేట(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు బుచ్చయ్య, శేఖర్, నాయకులు రాంచందర్, సాయి, సురేష్, శ్రీను, ముస్తాక్, జనార్ధన్‌రెడ్డి, మాణిక్యం, గణేష్ పాల్గొన్నారు.

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికులను సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల నుంచి గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీపీ జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు బిక్షపతి, రాజు, మల్లేశం, రాజయ్య, సాయిలు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాపరిషత్ కార్యాలయం సమీపంలో చేపట్టిన పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల పంచాయతీ ఉద్యోగ కార్మికుల పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దురావన్ డిమాండ్ చేశారు. గురువారం ఝరాసంగం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మేదపల్లి, ఈదులపల్లి గ్రామాల మీదుగా వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఝరాసంగం నుంచి సిద్దాపూర్ మీదుగా రుక్మాపూర్ వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని పలుచోట్ల కల్వర్టును నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్యారవరం, బోరేగావ్, బోపన్ పల్లివెళ్లి రహదారులు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రహదారులను మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, రాజు, రాహుల్, చిన్న అరుణ్, యాదగిరి, జైపాల్, నర్సింలు పాల్గొన్నారు.

జహీరాబాద్ రూరల్ ఎస్ఐగా ప్రసాద్‌రావు



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రూరల్ ఎస్ఐగా సీహెచ్. ప్రసాద్ రావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. రూరల్ ఎస్ఐగా ఉన్న పరమేశ్వర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో పటాన్‌చెరువు ఎస్ఐగా ఉన్న ప్రసాద్‌రావు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను తీసుకున్నారు.

మఠం భిక్షపతిని కలిసిన నాయకులు



మఠం భిక్షపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్‌లో తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మఠం భిక్షపతి ప్రమాణ స్వీకారానికి గురువారం నీలం మధు హాజరై భిక్షపతిని ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

హత్నూర(సంగారెడ్డి): మఠం భిక్షపతి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు శివశంకరరావు, జిల్లా జాగృతి అధ్యక్షులు దండు ప్రవీణ్‌రావు, మండల పరిషత్ అధ్యక్షులు వావిలాల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మఠం భిక్షపతిని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కంకోల్ మాజీ సర్పంచ్ అమర్‌బాబు, మండల నాయకులు చీలపల్లి నాగేష్, బోడపల్లి చాట్ల కృష్ణ పాల్గొన్నారు.

దుప్పట్లు, నోటుపుస్తకాలు పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో గురువారం విద్యార్థులకు దుప్పట్లు, నోటుపుస్తకాలను స్థానిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప పర్యవేక్షణలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి మాలిపాటిల్, ముదిరాజ్ కృష్ణ పాల్గొన్నారు.



గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల దరఖాస్తులకు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీ, అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలని, నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంగ్లీష్‌లో- 3, కామర్స్‌లో -2, గణితంలో -2 , తెలుగు-1, కంప్యూటర్ అప్లికేషన్/సైన్స్‌లో -5, వృక్షశాస్త్రంలో-1 జంతుశాస్త్రంలో-1 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునేవారు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 24వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో 25వ తేదీ ఉదయం 10 గంటలకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష) హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతుబీమాతో ధీమా**



కల్హేర్(నారాయణఖేడ్): రైతుబీమా పథకం రైతన్నకు ధీమాగా ఉందని ఎంబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు రోషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపూర్‌లో లచ్చవ్వ కుమారుడు సాయిలు, మెట్టుకుంట తండాలో విఠల్‌నాయక్ కుమారుడికి రూ.5లక్షల చొప్పున రైతుబీమా సహాయం అందజేశారు. ఆత్మ చైర్మన్ రాంసింగ్, సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ భూంరెడ్డి, ఉపసర్పంచ్ ఈశ్వర్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాంరెడ్డి పాల్గొన్నారు.

◆ **అయిల్‌ఫామ్ సాగుకు అనుమతి**

మునిపల్లి(అందోల్): అయిల్‌ఫామ్ సాగుకు, గోద్రేజ్, ఆగ్రోవేట్ కంపెనీకి సంగారెడ్డి జిల్లాలో ఫామ్ అయిల్ తయారీ ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని అగ్రికల్చర్ మండల అధికారి కీర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-2023 సంవత్సరానికి సంబంధించి సంగారెడ్డి జిల్లాకు 5వేల ఎకరాలను లక్ష్యంగా చేసుకుందన్నారు. అయిల్ ఫామ్ మొక్కలను, డ్రిప్‌ను సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తివివరాలకు మండల వ్యవసాయాధికారితో పాటు 7997725271 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

◆ **ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ కౌన్సిలింగ్**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ డిప్లమో కోర్సులలో మిగిలిన సీట్లకు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి సర్టిఫికెట్లతో ఈ నెల 28వ తేదీన స్పాట్ అడ్మిషన్‌కు రావాలని సూచించారు.

◆ **గ్రామాల్లో త్రిష దామోదర పర్యటన**



సంగారెడ్డి మున్సిపాలిటీ: పల్లె పల్లెకు మీ ఆడబిడ్డ కార్యక్రమంలో భాగంగా చౌట్కూరు మండలంలోని తాద్దన్పల్లి గ్రామంలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష దామోదర బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చౌటకూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నత్తి దశరథ్, చౌట్కూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, మహిళా మండల అధ్యక్షురాలు పల్లవిరెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు మౌలానా, బీసీ సెల్ మండల అధ్యక్షులు గణేష్, గ్రామకమిటీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి చర్యలు**

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామంలోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ ప్రకాశ్‌చారి తెలిపారు. గురువారం మండలంలోని గడ్డపోతారంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు స్థలాల కేటాయింపు, దళితబంధు అమలు, గృహలక్ష్మి పథకాలపై చర్చించారు. అదేవిధంగా గ్రామంలోని పలు సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేశారు. ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ జానాబాయి, ఈఓ నరేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తులకు ఆహ్వానం**

కొండాపూర్(సంగారెడ్డి): అర్బన్ రెసిడెన్షియల్ బీహెచ్ఈఎల్ పాఠశాలలో పనిచేసేందుకు నాన్ టీచింగ్ స్టాఫ్ అటెండర్ -1, అసిస్టెంట్ కుక్ -1 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి గురువారం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖా స్తులు చేసుకునే అభ్యర్థులు సంగారెడ్డి జిల్లా చెందిన వారై ఉండాలని, అభ్యర్థులు తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలన్నారు. అటెండర్ -1 పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఆఫీసు పని గురించి పరిజ్ఞానం కలిగి ఉన్నవారు అర్హులని తెలి పారు. అసిస్టెంట్ కుక్ -1పోస్టుకు 10వ తరగ తి ఉత్తీర్ణతతో పాటు డెమో ద్వారా నియమిస్తామని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలు, బోనాఫైడ్, ఆధార్‌కార్డు జత చేయాలని సూచించారు.

◆ **ఇంద్రకరణ్ పీఎస్ సందర్శన**



కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌ను రూరల్ సీఐ సుధీర్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఐలు, రాములు, నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **దుదగొండ మాజీ సర్పంచ్ మృతి**

మనూరు (నారాయణఖేడ్): మండలంలోని దుదగొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రముఖ న్యాయవాది పట్లోళ విజయభాస్కర్‌రెడ్డి (52) గురువారం మృతి చెందారు. ఈయన 2009 నుంచి 2014 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

◆ **ఓటరు జాబితాపై అవగాహన**

కల్హేర్(నారాయణఖేడ్): ఓటర్ జాబితా సవరణ, తదితర అంశాలపై కల్హేర్‌లో గురువారం బీఎల్‌ఓలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మన్మథకిశోర్ బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ ఉమర్‌పాషా, జూనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

◆ **సాయిబాబా ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇశ్రితాబాద్ శివారులోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం సమయంలోనే స్వామివారికి అభిషేకాలు,అర్చనలు తదితర పూజా కైంకర్యాలు చేపట్టారు.అదేవిధంగా స్వామివారికి ప్రత్యేక అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.